కుంపటిలో కుసుమం

శ్రీ మధురాంతకం రాజారాం

* గతసంచిక తరువాయి

ప్రొద్దుపోయి, ఊరంతటా దీపాలు వెలిగి, వీథుల్లో జనసంచారం ఎక్కువైన ఓ సంధ్యాసమయాన రంగడు హైరోడ్డు వెంబడే నడువసాగేడు. ఆరోజు మధ్యాహ్నమే అతడు కటకటాల్లోంచి బయటికి వచ్చాడు. తనకారోజు విముక్తి లభిస్తుందని రంగడికి తెలియదు. అతడు తేదీలు, నెలలు గుర్తుంచుకోడానికి ప్రయత్నించలేదు. పది యిరవైరోజులైతే వాటిని లెక్కించుకోనూవచ్చు, అవి ఒక్కొక్కటిగా గడచి పోతున్నాయని ఆనందించనూ వచ్చు. తను చెఱలో గడపవలసిన రోజులు ఏడు వందలకు పైచిలుకు! ఈసుదీర్ఘమైన చీకటిబ్రతుకు నెలాగడపడమన్న చింత లోపలినుంచి చెట్టును తొలిచివేసే వేరుపురుగులా రంగడి హృదయాన్ని దహించి వేయసాగింది. అతడు తనచుట్టూవున్న రాతిగోడని చూచేవాడు. ఆగోడకు తల బాదుకుంటే మనోవేదన కొంత చల్లారుతుందేమో ననుకునేవాడు. కమ్మల్ని చూచేవాడు. చేతులుచాచి వాటిని వంచి విరిచి నుగ్గునూచ చేసివేద్దామనుకునేవాడు. కమ్మల్లోనుంచీ చెట్లు, వాటిపైన ఆకసంలో ఎగిరిపోతున్న పక్షులు కనిపించేవి. తనూ ఒకపక్షై వాటితోకలిసి రివ్వున పరతెంచి తన రమణిచేతుల్లో వ్రాలినట్టు ఆమె తనని హృదయానికి హత్తుకుని ముద్దాడినట్టు భావించేవాడు. అంతలో మళ్ళీ తన నిజపరిస్థితి తెలిసి వచ్చేది. "అంతా భ్రమ! ఇవి కమ్ములు, ఇవిగోడలు, ఇదిజైలు, నేను పక్షిని కాలేదు. రమణిచెంతకు పోలేను" అనుకుంటూ కుమిలిపోయేవాడు.

రంగడు జైల్లో మనిషిలా బ్రతకలేదు. యంత్రంలా బ్రతికాడు. యంత్రానికి పనిచేద్దామని గానీ, మానుకుందామని గానీ వుండదు. మర యిటుత్రిప్పితే పనిచేస్తుంది. అటుత్రిప్పితే మానుకుంటుంది. రంగడూ అంతేచేశాడు. పైవాళ్ళు లేవమంటేలేచాడు. పడుకోమంటే పడుకున్నాడు. తినమంటే తిన్నాడు. లేకుంటే పస్తున్నాడు. యంత్రం పనిచేసినన్నిరోజులూ చేస్తుంది. ఎక్కడో ఒక కీలు విరిగినప్పుడు టకీమని ఆగిపోతుంది. రంగడిగతీ అంతేఅయింది. ఓరోజు పాతాళగంగని పైకితోడుతూ అతడు చేంతాడు మధ్యలో విడిచిపెట్టి దభేలున క్రిందపడిపోయాడు. కాపలావున్న రక్షకభటుడు పరుగెత్తివచ్చి రంగడిపైన చేయివేసి చూచాడు. జ్వరం నూటికిపైన కాస్తోంది. పైఅధికారికి, కబురువెళ్ళింది. జ్వరంతోవున్న ఖైదీచేత పనిచేయించినందుకు అతడు కాపలావాళ్ళపైన మండిపడ్డాడు. తనకు జ్వరమని రంగడు చెప్పనేలేదు. అడగందే అమ్మయినా బువ్వపెట్టదు. ఖైదీకి జ్వరమని గ్రహించి, వాడికి సపర్యచేయవలసిన అవసరం పోలీసు వాడికిలేదు. క్రిందపడినతర్వాత తనకు స్మృతి రావడానికి ఎన్నిరోజులుపట్టిందో రంగడికి తెలియదు. లేచి తనవైపొకసారి చూచుకున్నాడు. తను మునుపటి రంగడుకాడు. అస్థిపంజరంపైన చర్మపుతొడుగులావున్న యిదేనా తనశరీరం? కాదు. రమణితోబాటూ తన రూపసంపదని సైతం ఎవరో కాజేశారు!

జ్వరం నిమ్మళించినతర్వాత రంగడు మళ్ళీ ఖైదీగా కటకటాల్లోపలికి వచ్చాడు. రోగశయ్యపైన అతడి మనసు నావరించుకున్న నిస్తబ్ధత, తేరుకున్న తర్వాతకూడా అలాగేవుండిపోయింది. జీవితోత్సాహం చిదికిపోయిన ముసలివాడిలా అతడు ఎక్కడకూచుంటే అక్కడేకూచునివుండిపోయేవాడు. పనిచేస్తూ చేస్తూవుండి అలసిపోయి కుప్పగా నేలపైన కూలబడేవాడు. తాననుభవించవలసిన రెండేళ్ళశిక్ష ఎప్పుడో పూర్తయినట్టు, అయినా తన నిస్సహాయతని గుర్తించిన అధికారులు మరి కొంతకాలం తననుండి చాకిరీ చేయించుకుని తనని చిత్తు చిత్తుజేసి వదలిపెట్టనున్నా రనుకుని అతడు అర్ధరాత్రప్పుడు భోరున విలపించేవాడు. కాని

అది అపోహని అతడికి అచిరకాలంలోనే తెలిసి వచ్చింది. చింతలతో వంతలతో కుములుతున్న వాళ్ళకు నిముషమే యుగంగా కన్పిస్తుంది. రంగడికి తన రెండేళ్ల శిక్ష ఒక మహాకల్పంగా గోచరించడంలో వింతలేదు. ఆరోజు ఉదయం తలుపు తెరుస్తూ కాపలావాడు "నీ శిక్ష పూర్తయింది" అన్నాడు.

రంగడు మళ్ళీ ప్రపంచంలో పడ్డాడు. మెల్లగా కాళ్ళీడ్చుకుంటూ రైల్వేస్టేషను వరకూ నడిచాడు. అతడెక్కవలసిన రైలు అరగంట క్రితం వెళ్ళిపోయింది. మళ్ళీ రాత్రి పన్నెండుకుగాని బండి లేదు. రంగడు టౌనువైపు దారితీశాడు. త్రోవలో ఒక బంకుదగ్గర ఆగి బీడీకట్ట కొనుక్కున్నాడు. కాలుతున్న టెంకాయ పురిలో ఒక బీడీ అంటించి ఎండిన అధరాలకు కొంచెం పదునెక్కించి ముందుకు నడవసాగేడు.

రంగడలా రెండు ఫర్లాంగుల దూరం నడిచి వుంటాడు. అక్కడొక చిన్నవీధి హైరోడ్డుతో కలుస్తుంది. రంగడా వీధి మొగసాల్లో ఆగాడు. అతడక్కడ ఆగిపోవడానికి కారణం ఒక సినిమా బొమ్మ. ఆ బొమ్మలో ఒక కొమ్మ నడివీధిలో నవ్వుల జడివాన కురిపిస్తోంది. రంగడు గోడకి అతికించబడి వున్న ఆ బొమ్మని చూడ్డం హఠాత్తుగా తటస్థించింది. ఆ చూచిన క్షణాన రంగడి శరీరం కొయ్యబారిపోయింది. అతడు కొయ్యబొమ్మలా ఆ బొమ్మని చూస్తూ నిలుచుండిపోయాడు.

ఆ నవ్వు రంగడికి సుపరిచితం. ఆ నవ్వు రంగడి బీడుబ్రతుకుపైన తొలకరి వానలా కురిసింది. ఆ నవ్వు కోసం, ఆ అరుణరాగరంజితాలైన పెదవులపై నుంచీ వచ్చే ప్రియవచనాలకోసం కాకపోతే రంగడు మరెందుకు బ్రతుకుతున్నాడు!

'బొంయ్, బొంయ్' మంటూ హైరోడ్డునుంచి వీధిలోకి మళ్లిన కారుక్రింద పడబోయి వెంట్రుకవాసిలో తప్పించుకుని ముందుకుపరుగెత్తాడు రంగడు! ఆ ఆందోళనలో అతడికి వీధిమధ్యలోనుంచి వైదొలగి ఏఅరుగుమీదయినా నిల్చుంటే, మరి ప్రాణాపాయముండదని స్ఫురించలేదు. ఆపరుగుతో అతడు వీధి చివరిదాకా వెళ్లాడు. ఒగర్చుకుంటూ అక్కడ ఆగి మళ్ళీ గోడవైపు చూచాడు. అక్కడ మరోబొమ్మ కనిపించింది. బొమ్మవేరైనా అందులోని కొమ్మ మాత్రం అదే! అదేయువతి మరో పోజులో! ఈసారి ఆవిడ ఒక మగవాడితో జంటగా ఊయలూగుతోంది.

రంగడు గట్టిగా కళ్లు మూసుకున్నాడు. తన మనోవీధిలో పొడమిన అనుమానాంకురాన్ని సమూలంగా నాశనం చేయడానికి ప్రయత్నించాడు. ఈవిడ రమణికాదు. కావడానికి వీల్లేదు. తన రమణి పరాయివాడితోబాటు ఊయల్లో కూచుని ఊగదు. తనెవతెనో చూచి రమణి అని భ్రమిస్తున్నాడు!

"తప్పుకో, తప్పుకో" అంటూ పరుగెత్తివస్తున్న రిక్షావాడికేకవిని ఉలిక్కిపడి రంగడు మరికొంతదూరం నడిచాడు. అతడు నడుస్తున్న రోడ్డు అక్కడ మరొక రోడ్డుతో కలుస్తుంది. ఆ వీధికెదురుగా రోడ్డు కటువైపున ఒక పెద్దహోటలు, ఆ హోటలుపైన పెద్ద సైజులో ఒక సినిమాపోస్టరూ చూచి రంగడు మళ్ళీ ఆగిపోయాడు. ఆబొమ్మలో ఇదివరకటి చిత్రాల్లోలా ఆయువతి నవ్వడమూ లేదు. ఊయలూగడమూ లేదు. వీణ వాయిస్తోంది. అదేయువకుడు వెనుకనుంచీ ఆమె జడలో ఒక గులాబీపువ్వు వుంచుతున్నాడు.

రంగడి హృదయవీణపైన ఎవరో చేయివేసి చరాలున తంత్రుల్ని తెంపివేసినట్టయింది. ఇందుగలదందు లేదని ఎందూ కనిపిస్తున్న ఆ బొమ్మలబారినుంచీ తప్పించుకోడానికి అతడు కాలికొద్దీ అటూ, యిటూ పరుగుతీశాడు. ఎంతగా నిమ్మళపరుచుకోబోయినా అతడి మనసు పట్టుసడలి మళ్ళీ మళ్ళీ అదే అనుమానానికి గురికాసాగింది. వేయిమందిలో వున్నా రమణిని తను గుర్తుపట్టగలడు. ఈవిడ రమణే! మరొకరైతే తన హృదయాని కింత అఘాతం కలిగివుండదు... కాదు. ఈవిడ రమణికాదు. తను నేరస్థుడుగా యిల్లు విడిచిపెట్టిన తర్వాత రమణి దిక్కూ, మొక్కూలేని ఏకాకి. ఆమె ఎక్కడో ఒకచోట చాకిరీచేసి పొట్టపోసుకుంటూ తన రాకకోసం ఎదురు తెన్నులు చూస్తుంటుంది. తారాపథంలో మిలమిల మెరసిపోతున్న ఈవిడ, తన సంపర్కంవల్ల సుఖశాంతుల్ని గోల్పోయిన అభాగ్యురాలు రమణి ఒక్కరే కావడం కల్ల!

రాత్రి ఎనిమిదిగంటలు దాటివుంటుంది. దూలాల్లా ఊరిపోయి బరువెక్కిన కాళ్ళనీడ్చుకుంటూ

నసవలేక రంగడు ఒక చెట్టుక్రింద కూచున్నాడు. అక్కడే పడుకుని కాసేపు నిద్రపోతే ఎంత బాగుండు ననిపించిందతనికి! కానీ దౌర్భాగ్యుడెక్కడికి పోయినా దురదృష్టం వాడివెన్నంటే వుంటుంది! అక్కడికి చేరువగా విద్యుద్దీపాల వెలుగులో ఒక సినిమాహాలు పూలతెప్పలా రంగడికి కనిపించింది. ఆరిపోతూ మళ్ళీ వెలుగుతున్న ఎలక్ట్రిక్ బల్బులమధ్య రమణి ఆకారం అంతలో కనిపించి, అంతలో మాయమైపోతోంది. ఆ చిత్రం చూస్తూ, చూస్తూ రంగడు పైకిలేచాడు. లేచి పది అంగల్లో హాలుదగ్గరికి వెళ్ళి అర్ధరూపాయ కిటికీలోవిసరి "టికెట్టు, టికెట్టు" అన్నాడు. ఎనిమిదిగంటల వేళప్పుడు సినిమాకి బయల్దేరివచ్చిన విచిత్రవ్యక్తిని ఓరకంటితో చూస్తూ బుకింగుక్లర్కు ఒక నేలటికెట్టు చించి రంగడిచేతిలో వుంచాడు.

ఏ బలీయమైన ఆకర్షణలవల్లనైతే ప్రేక్షకులు ఆ చిత్రాన్ని విరగబడి చూచారో ఆ రసవత్తర ప్రణయ సన్నివేశాల్ని రంగడు అయిదారు నిమిషాలకంటే ఎక్కువసేపు చూడలేకపోయాడు. అతడు హాల్లో అడుగుబెట్టేసరికి వెండితెరపైన నాయకీ నాయకులమధ్య ఒక చిన్న ప్రణయకలహం సాగుతోంది. నాయకుడు ఆఫీసునుంచి తిరిగిరావడంలో కొంత విలంబనం జరిగింది. ఈ టీకప్పులో తుపాను కిదీ కారణం! ఆమె ముఖాన్ని ముకుళితపద్మం చేసుకుంది. అతడు వెయ్యివిధాల బుజ్జగించాడు. కడకు కాఫీటంబ్లరు ఆమె పెదవుల కందిస్తూ "నువ్వు నా రాణీవైతే ఈ కాఫీ కళ్ళుమూసుకుని త్రాగేయాలి" అన్నాడు. త్రాగకపోతే నువ్వు నా రాణీవు కావు పొమ్మంటాడని భయమేమో, ఆవిడ నాలుగు గ్రుక్కల్లో కాఫీ పూర్తిచేసి "చూచారా! నేను మీ రాణినే!" అన్నట్టు భర్తవైపు ఓరకంటితో చూచింది. ప్రేక్షకులు ఆ శృంగారఘట్టాన్ని అప్రీసియేట్ చేస్తూ చప్పట్లు చరిచారు. ఆ కరతాళాలు రంగడితలపైన సమ్మెట వ్రేటుల్లా మారుమ్రోగాయి. ఇంతలో నాయకి మళ్ళీ ఒక ప్రత్యేక ప్రణయ పారవశ్యాన్ని అభినయించింది. ఉన్నట్టుండి ఆవిడ భర్తవైపుతిరిగి "చూడండి, ఆలస్యంగా వచ్చినందుకు మిమ్మల్నేంచేస్తానో" అంటూ అతడి రొమ్ముపైన రెండుచేతుల్తోనూ గుద్దులు కురిపింపసాగింది. ప్రియురాండ్ల పాదతాడనాల్ని సైతం సైరించిన కథానాయకుల కోవకుచెందిన వాడేమో, అతడు పెద్దపెట్టున నవ్వసాగేడు. అతడితోబాటు ప్రేక్షకులూ నవ్వారు. ఆ నవ్వుల సుడిగాలిలో రంగడి హృదయం శుష్కపత్రంలా గిరవాట్లు కొట్టింది. అతడికి లోకు లందరూ ఒక్కుమ్మడిగా తనని అవహేళన చేస్తున్నట్టు తోచింది. నవ్వుతున్న ప్రేక్షకసమూహాన్ని చురచుర చూస్తూ అతడు ఎలుగెత్తి "ఆపండి, ఆపండి" అని కేకవేశాడు. ఒక క్షణంపాటు అక్కడ కూచున్న వాళ్ళ కళ్ళన్నీ రంగడివైపు తిరిగాయి. ఆ చూపులు రంగణ్ణి యిట్టే పిచ్చివాడుగా తేల్చివేశాయి. వస్తాదుల్లాంటివాళ్ళిద్దరు పైకిలేచి రంగణ్ణి బయటికిలాక్కొచ్చి సింహద్వారం చూపించారు.

గమ్యస్థానమంటూ లేక రంగడు వీధుల్లో తిరుగసాగేడు. పదిగంటలకు సినిమానుంచీ యిళ్ళకువెళ్తున్న వారితోనూ, రెండో ఆటకు పోతున్న వారితోనూ వీధుల్లో మళ్ళీ రద్దీ ఎక్కువైంది. ఆ జనసమూహం మధ్యనడుస్తున్న రంగడికి, అతడి కవసరమైన భోగట్టా కొంత లభించింది. ఎవరో యిద్దరు ముగ్గురు చిత్రం బాగోగుల్ని గురించి మాట్లాడుతుండగా నాయకి నటనకి సంబంధించిన ప్రస్తావన వచ్చింది. తరువాత చర్చ నాయకి వ్యక్తిగత జీవితంవైపు మళ్లింది. అదృష్టం అంటే అలా వుండాలట! ఎక్కడో నాటకాలాడుకుంటున్న మనిషి ఎవడినో లేవదీసుకుని వెళ్ళిపోయింది. వాడిది కాపురంచేసే ఏడ్చేమొహంకాదు. ఆవిడని నట్టేటిలో పుట్టిలా విడిచి వాడెక్కడికో వెళ్ళిపోయాడు. ఎవరెవరి నోము ఎప్పుడు పండుతుందో ఎవరు చెప్పగలరు? ఆమె కెలాగో సినిమావాళ్ళ ప్రాపకం దొరికింది. అవకాశం దొరకడమేమిటి, చిటారు కొమ్మలో మిఠాయి పొట్లంలా వెలిగిపోవడమేమిటి, ఒక్కసారిగా జరిగాయి.

రంగడి అనుమానం కాస్తా బలపడింది. పూర్తిగా బలపడిందని చెప్పవచ్చుకూడా! కానీ రంగడి కప్పటికీ ఒక సందేహం వుండిపోయింది. తన చెవులూ, కళ్ళే తనని మోసగిస్తున్నాయేమో!

పదినిమిషాల తర్వాత రంగడు తలపైకెత్తి చూశాడు. ఎదుట రైల్వేస్టేషను కనిపించింది. ప్లాట్‌ఫారం దగ్గర పొగవిడుస్తూ రైలు నిలబడివుంది. తలుపు తెరచి రంగడు బండిలో అడుగు బెట్టాడో లేదో, అతడి

కోసమే అక్కడికి వచ్చి, అత డెక్కగానే యింక తన కక్కడ పని తీరిపోయినట్టు రైలు కదిలింది.

*   *   *

పత్రికల్లో ఒకవార్త పడింది. చిత్రమైన వార్త. పువ్వుల అంచులకు మధ్య 'తారకాసురుడు' అన్న శీర్షకక్రింద వార్త ప్రచురింపబడింది. "ఊరూ, పేరూ లేని దేశద్రిమ్మరి ఒకడు ఒక ప్రఖ్యాత సినిమాతార యిల్లెక్కడో వాకబు చేసుకుంటూ పట్టణంలో తిరుగుతున్నాడు. వాలకం చూస్తే నాలుగేళ్లు ముక్కుమూసుకుని హఠయోగంచేసిన బైరాగిలా కనిపిస్తున్నాడు. సదరు సినిమాతార నొక్కసారి చూడ్డం తప్ప తన కెలాటి దురుద్దేశమూ లేదని అతడు చెప్పుకుంటున్నాడు."

ఈ వార్త ప్రచారితం అవుతుండగానే ఆ సినీతార యింటి ముందు ఓ సంఘటన జరిగింది.

రెండంతస్థులమేడ ప్రక్కనుంచీ రోడ్డువరకూ వ్యాపించివున్న పూలతోటకు మొదట వేపచెట్టుక్రింద సుఖాసీనుడయ్యే ఘూర్ఖావాడి కథనం ప్రకారం, ఒకరోజు వుదయం ఆ సినీనటి కోసం వచ్చిన వాడొక 'దోవపోకిరి.' ఘూర్ఖా వాడెక్కడ పుట్టి ఎక్కడ పెరిగాడో ఎవరికీ తెలియదు. అతడికి తెలుగు, అరవం, ఇంగ్లీషు భాషల్లో ఏదీరాదు. రావాల్సిన అవసరం కూడా లేదు. అతడిపని గేటు దగ్గరికి వచ్చిన వాళ్ళని వెళ్ళిపొమ్మనటం. ఆ వెళ్ళిపొమ్మనడానికి కావలసిన పదాలన్నీ అతడికి క్షుణ్ణంగా తెలుసు.

రూక్షవీక్షణాలు, కర్కశ కంఠస్వరమూ ఘూర్ఖావాడి సొత్తులని రంగడికి తెలియదు. అతడికి తెలిసినంతల్లా ఆ ఘూర్ఖావాడు గూడా తనలాటి మానవుడేనని. ఆ నమ్మకంతో నే అతడు ఘూర్ఖాని సమీపించాడు.

"ఎవరు నువ్? ఏం కావాలి?" అన్నాడు ఘూర్ఖావాడు.

రంగడికి భయంవేసింది. ఐనా చల్లకువచ్చి ముంత దాచినందువల్ల లాభంలేదు అతడు జేబులో నుంచీ నాలుగు బీడీలుతీసి ఘూర్ఖావాడి చేతిలో వుంచబోతూ "మరేమనుకోవద్దు బాబూ! నేనొకసారి లోపలికి వెళ్ళాలి" అన్నాడు.

"లోపల్కి వెళ్ళాలా? అదే పైత్యం! పోడా దూరమా!" గర్జించాడు ఘూర్ఖా.

"ఒకటి రెండు నిమిషాల్లో పని చూచుకుని మళ్ళీ వచ్చేస్తాను బాబూ!" ప్రాధేయపడ్డాడు రంగడు.

ఘూర్ఖావాడి కళ్ళు చంద్రడనిప్పుల్లా మెరిసాయి. అతడిచేయి తోలుపటకాపైకి పోయింది. అరక్షణంలో రంగడి కళ్ళముందు నాగుబాము పడగలాంటి తెల్లటి బిచువా మెరిసి పోసాగింది.

గుండె జేజారెత్తి రంగడు నాలుగు బారలు పరుగెత్తి ప్రాకారకుడ్యానికి ఆనుకున్నాడు. క్రిమినీ, కీటకాన్నీ చూచినట్టు ఘూర్ఖావాడు రంగణ్ణి చూడసాగేడు.

రంగడు ఘూర్ఖాని కొస్తా మెత్తపరచడానికి సాధనాంతరాలు అన్వేషింపసాగాడు. తన దగ్గర డబ్బులేదు. ఉంటే వున్న డబ్బంతా వాడి పాదాలముందు పోయడానికి తను వెనుకదీయడు. ఐనా ధోరణి చూస్తుంటే వీడు డబ్బుకు పాలుమాలేవాడులా కనిపించడం లేదు. ప్రబతిమాలుకుందామంటేనా, దగ్గరికి వెళ్ళేసరికే మండిపడుతున్నాడు. ఇంక ఏం చేయాలి?...రంగడు ప్రాకారం వైపుచూచాడు. ఊహూ, లాభంలేదు. గోడ ఎత్తుగా వుండడం మాత్రమే గాదు. పైన దట్టంగా గాజుపెంకులు కూడా వున్నాయి.

రోడ్డుపైన వస్తున్న కారొకటి వున్నట్టుండి బంగళావైపు తిరగడంతో రంగడి ఆలోచనలకు బ్రేక్ పడింది. కారు శరవేగంతో ముందుకు వస్తోంది. రంగడు ఒకడుగు ముందుకు వేశాడు. అతడొకటి రెండు క్షణాలకన్నా ఎక్కువసేపు కారులోపలికి చూచివుండడు. ఐనా తనరమణిని పోల్చుకోడానికెంతసేపు కావాలి! అతడా నిమిషాన తనకీ రమణికీ వున్న అంతరాంతరాల్ని మరచిపోయి "రమణీ, రమణీ" అంటూ ముందుకు పరుగెత్తాడు.

మేడ ముందు ఆగిన కారునుంచి క్రిందికిదిగుతూ రమణి డ్రయివరుతో "గేటుదగ్గర ఎవరో కారు వెంబడి పరుగెత్తి వచ్చినట్టుంది కదూ!" అంది.

"అలాగాండీ! నేను చూడలేదు" అన్నాడు డ్రయివరు.

"నువ్వు కారుని షెడ్‌లోకి తీసుకెళ్లు" అంటూ రమణి వెనుదిరిగి గేటు దాకా నడిచింది. గూర్ఖావాడు లేచి నిలబడి సెల్యూట్ చేశాడు.

కుంపటిలో కుసుమం

"ఎవడా మనిషి? ఎలా వెళ్ళి పోయాడు?" అంది రమణి.

"వాడాండీ! ఒరు వేగబాండ్! ఇంకచస్తే యింటపక్క రాడు—పోలీసు పట్టుకెళ్ళారు"

రమణి తలవంచుకుని మళ్ళీ మేడ వైపు నడవ సాగింది. మధ్యలో వజ్రపాణి ఎదురై "ఎక్కడికి వెళ్లావు రమణీ ఎండలో" అన్నాడు.

"అబ్బే, ఎక్కడికీ లేదు. ఆ పొదరింట్లో కాసేపు కూచుందా మని" అంది రమణి.

"ఐతే పొదరింటికి వెళ్లవలసిన దారి యిది కాదు. అది" అంటూ నవ్వాడు వజ్రపాణి

రమణిలో అప్పుడప్పుడూ పరధ్యానం శృతి మించి రాగాన పడుతుండటం వజ్రపాణి గమనించక పోలేదు. ఆపరధ్యానానికి మూలకారణ మేదో అతడికి తెలుసు. ఎంతగొప్ప అంతస్థు అందుకో గలిగినప్పటికీ, ఒక్కొక్కప్పుడు మానవులదృష్టి అధోలోకాల వైపు ప్రసరిస్తుంటుం దెందుకో అని వజ్రపాణి రమణి పరధ్యానంగా వున్నప్పుడల్లా తర్కించుకుంటాడు.

రమణిని చిత్రరంగంలో ప్రవేశపెడుతూ వజ్రపాణి ఆమె పైన గొప్ప ఆశలేవీ వుంచుకోలేదు ఉదర పోషణ కామె కొక వెరవు చూపించినందుకు అతడికి సంతృప్తి కలిగిన మాట మాత్రం నిజమే! కాదంటే ఆ సంతృప్తితోబాటూ తనలో పరోపకార పారీణత లేక పోలేదనే విశ్వాసం సైతం అతడికి కలిగింది. కాని రమణిపట్ల అతడు వేసుకున్న అంచనా కొద్దికాలంలోనే తారుమారయింది. ఆమెలో వృద్ధికిరాగల లక్షణాలు చూడ నేర్చిన వారి కళ్ళకు గోచరించాయి. వాళ్ళు మట్టినుంచి మణుల్ని పైకి తీసే యింద్రజాలాన్ని వజ్రపాణికి అంటగట్టి అతణ్ని నేలపై నుంచీ నాలుగు బారలు పైకెత్తేశారు. అప్పటినుంచీ వజ్రపాణికి రమణిపైన శ్రద్ధ యినుమడింపసాగింది. ఆమెని పైకి తీసుకరావడంకోసం ఆలోచించడం అతడి నిత్యకృత్యాలలో ఒకటై కూర్చుంది.

ఆరునెలల క్రిందటి సంగతి. అప్పుడప్పుడే రమణికి చిత్రరంగంలో ప్రాబల్యం కలుగుతోంది. షూటింగులతో ఆమెకి రేయింబవళ్లూ తెమలడంలేదు. ఒరోజున ఉదయం వజ్రపాణి ఆమెని ఔట్‌డోర్ షూటింగుకి బయలుదేరదీస్తుండగా, పోస్టుమెన్ ఆమెకో ఉత్తరం తెచ్చాడు. రెండు వారాలకుముందు పెట్టెలో పడిన ఆవుత్తరం రమణిని అన్వేషిస్తూ దేశమంతా ఒక ప్రదక్షిణం చేసుకుని వచ్చింది. వజ్రపాణే వుత్తరం చించి చదివాడు. రంగడు చావు బ్రతుకుల మధ్య వున్నాడనీ ఆత్మీయులెవరైనా వుంటే వచ్చి చూచి పోవచ్చుననీ జైలు అధికారులు వ్రాశారు.

"ప్రోగ్రాం కాన్సిల్ చేయించండి. నే నక్కడికి వెళ్లి రావాలి" అంది రమణి.

వజ్రపాణికి చిర్రెత్తుకొచ్చింది. పెద్ద ఎత్తున ప్రారంభమైన షూటింగులు వదలిపెట్టి ఆ రంగణ్ణి చూచిరావాలని చెప్పడానికి రమణి కెలా నోరాడిందో అతడికి అర్థం కాలేదు.

"మీ కేనండీ చెప్పడం! నా కెలాగైనా నాలుగు రోజులు శెలవిప్పించండి" అంది మళ్ళీ రమణి.

వజ్రపాణి రమణి ముఖంలోకి చూచాడు. ఆవిడ నిశ్చితాభిప్రాయం అతడికి అవగతమైంది. అది కాస్తా అవగతం కావడంతో అతడు తన ధోరణి మార్చుకుని "చూడు రమణీ! రంగడు నా తమ్ముడు. వాడిపైన నీ కెంత అక్కరుందో నాకూ అంత అక్కరుంది. ఇక్కడ కొన్ని వేల రూపాయలు నష్టపరిచి నువ్వు వాడిని చూచి వచ్చినందువల్ల ఒరగబోయే దేముంది? నీ బదులు నేను వెళ్ళొస్తాను. వీలుంటే అధికారులతో మాట్లాడి అతణ్ణి తీసుకొచ్చేస్తాను కూడా! సరేనా!" అన్నాడు.

రమణి కొంతసేపు ఆలోచించి సరేనంది.

తన జీవితంలో బొత్తిగా తన కిష్టంలేని పనేదైనా వజ్రపాణి చేసివుంటే అది రంగణ్ణి చూడ్డానికి వెళ్లడం. తీరా అతడు వెళ్ళేసరికి రంగడు స్మారకం తప్పి మంచంపైన పడివున్నాడు.

"రోగి పరిస్థితి ఎలా వుందండీ?" అని వజ్రపాణి నర్సుని అడిగాడు.

"అబ్బే. ఏం బాగుండలేదండీ! ఇలాటి కేసులు నేను చాలా చూచాను. నూటి కొకరిద్దరు బ్రతికితే హెచ్చు" అంది నర్సు.

వజ్రపాణి డాక్టరు దగ్గరికి వెళ్లి మళ్లీ అదే ప్రశ్న వేశాడు. "గోడమీద పిల్లి వాటంగా వుంది కేసు. ఇటూ చెప్పలేము. అటూ చెప్పలేము. మొత్తంమీద పరిస్థితి ప్రమాదకరమే" అన్నాడు డాక్టరు.

"ఇటువంటి కేసుల్లో ఒకటి రెండుకంటే ఎక్కువ నయం కావంటారండీ! మీకు తెలియని విషయం గనుకనా!" అన్నాడు వజ్రపాణి

"ఎవరామాట చెప్పింది?" డాక్టరు కొంచెం కటువుగా ప్రశ్నించాడు.

"ఆవిడేనండీ! ఆ లావుపాటి నర్సు" అన్నాడు వజ్రపాణి

"నూటికి పది పదిహేను కేసులు కూడా నయమౌతాయి. ఆవిడకి తెలియదు" అన్నాడు డాక్టరు.

ఎందుకోగాని వజ్రపాణికి డాక్టరుకంటే నర్సే అనుభవజ్ఞురాల్లా కనిపించింది. పోనీ డాక్టరు అభిప్రాయాన్నిబట్టి చూచినా రంగడు మామూలు మనిషి కాగలడనడానికి అట్టే అవకాశం కనిపించడంలేదు. పది పదిహేనుమందిలోకన్నా, ఎనభై ఎనభైఅయిదు మందిలో రంగణ్ణి కలిపివేయడం వజ్రపాణికి సమంజసంగా తోచింది.

ఆరోజు సాయంత్రమే వజ్రపాణి పట్నానికి తిరిగి వచ్చాడు. ముఖం చిన్నబుచ్చుకుని "మనకి రంగడు లేడు రమణీ" అని చావుకబురు చల్లగా చెప్పేశాడు. రంగడెలాగా పదిరోజుల్లో చనిపోబోతున్నాడు గనుక ఈ అబద్ధం చెప్పడం మరేమంత కొంపమునిగిపోయే అపరాధం కాదని కూడా వజ్రపాణి తన అంతరాత్మకి నచ్చజెప్పుకున్నాడు.

* * *

ఉన్నట్టుండి ఆశ్లేషాపిక్చర్స్‌వాళ్ళకి బిచ్చగాళ్ళు కావలసివచ్చారు. వాళ్లకప్పుడప్పుడూ రాజులు కూడా కావలసివస్తారు. కానీ రాజులతో వాళ్ల కట్టే చిక్కుండదు. మెడకాయపైన తలకాయవున్న సాధారణ మనిషి కెవడికైనా సరే చెమ్కీ గుడ్డలు తొడిగి, గాజుపూసల దండలు రెండు వేసి, వలెవాటు గిరజాలు కైసేసి రాజుగా నిలబెట్టగల సామర్థ్యం వాళ్ళకుంది. బిచ్చగాళ్లకలాంటి అలంకారాలు పనికిరావు. వీలయినంత మాసి, చినిగిన దుస్తుల్లో బాగా వికారంగా కనిపిస్తే తప్ప వీడు బిచ్చగాడేనని ప్రేక్షకులు నమ్మరు. ప్రేక్షకులు సామాన్యంగా సంశయాత్ములు.

ఐనా ఒకరిద్దరు బిచ్చగాళ్లని తయారుచేయడం ఆశ్లేషా పిక్చర్స్‌వారికేమంత కష్టమైన పనిగాదు. గేట్‌కీపరునుంచీ కథానాయకి వేలువిడిచిన తమ్ముడువరకూ ఎవరో ఒకరు బొచ్చె చేతబట్టుకుని అపర బిచ్చగాళ్లలా సాక్షాత్కరించి అవసరం గడుపుకోడానికి ఉపకరిస్తుంటారు. కానీ వచ్చిన చిక్కల్లా ఏమిటంటే ఆశ్లేషా పిక్చర్స్‌వాళ్ళకి దాదాపు నూరుమంది బిచ్చగాళ్లు కావలసివచ్చారు. అందులోనూ వాళ్లందరూ నిజమైన బిచ్చగాళ్లే అయితే ఆ ఘట్టంలో సహజత్వం ఉట్టిపడగలదని విజ్ఞులు కొందరు సలహా యిచ్చారు.

నిర్మాత డైరక్టరు ముఖం చూచాడు. డైరక్టరు ప్రొడక్షన్ మేనేజరు ముఖం చూచాడు. ప్రొడక్షన్ మేనేజరు పేవ్‌మెంట్ల వెంబడే పరుగులు తీశాడు. మరునాటి ఉదయం తెల్లవారేసరికి రెండు లారీల నిండుగా బిచ్చగాళ్ళు హాజరు పరచబడ్డారు.

కలకలలాడుతున్న పూలతోట మధ్య రాజమహాలు బిచ్చగాళ్లకు నేత్రపర్వంగా కనిపించింది.

"అబ్బబ్బ ఏం మహాలు! ఏం మహాలు!" అంటూ విస్తుపోయాడు ఒక అమాయకపు బిచ్చగాడు.

"గొప్ప మహాలేలే! వట్టి అట్టముక్కలు" అన్నాడొక తెలివైన బిచ్చగాడు.

"ఐతే యిదంతా పైకి పటారమే నన్నమాట" అంటూ మరొకడు కిసుక్కున నవ్వాడు.

"ఇష్ మాట్లాడగూడదు. మీరందరూ ఒక్కొక్కరుగా ఈ దారంట పైకి వెళ్లాలి. ఆ మలుపు తిరగ్గానే ఆర్చి దగ్గర మహారాణి నిలబడివుంటుంది. ఆమె దగ్గర దానాలు పరిగ్రహించి అందరూ ఒక్కొక్కరుగా ఆవైపునుంచే తిరిగి వచ్చేయాలి" అన్నాడు దర్శకుడు.

ఒక సందేహప్రాణి డైరక్టరుకు అడ్డుతగిలి "ఐనా మహారాణిగారికి ఈరోజింత దయ కలగడానికి కారణమేమండీ?" అన్నాడు.

"ఓహో! అదా మీ సందేహం! అలా అడగాలి. మహారాజుగారు పొరుగు దేశంపైకి దండెత్తారు. యుద్ధం జరుగుతోంది. ఓహ్ భయంకరమైన యుద్ధం. రాజుగారి విజయాన్ని కోరుతూ మహారాణి బీదలకు దానధర్మాలు చేస్తోంది."

బిచ్చగాళ్లు ఒక్కొక్కరే పైకి వెళ్ళి, అవతలి వైపునుంచి క్రిందికి వచ్చేయసాగేరు.

"ఇంకా ఎందరున్నారండీ?" అన్నాడు కొంచెం విసుగుతో కేమెరామెన్.

"ఇదిగో కడపటివాడు" అన్నాడు డైరక్టరు.

బిచ్చగాడు మహారాణిముందు నిలబడ్డాడు. మహారాణి చెలికత్తె అందించిన నూత్న వస్త్రాల్ని చేతికి తీసుకుంది. బిచ్చగాడు చేతులు ముందుకు చాచాడు. మహారాణి బిచ్చగాణ్ణి జూచింది. బిచ్చగాడు మహారాణిని చూచాడు. బిచ్చగాడు "రమణీ! రమణీ!" అన్నాడు. మహారాణి "రంగా రంగా" అంటూ బిచ్చగాణ్ణి కౌగలించుకుంది.

కంగారుతో డైరెక్టరు "కట్ కట్" అన్నాడు.